క్లుప్తంగా

పౌర గ్రంథాలయంలో క్విజ్ పోటీ



విజేతలతో క్విజ్ మాస్టర్ సూర్యారావు

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న యువతకు గ్రంథాలయ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం క్విజ్ పోటీ నిర్వహించారు. 50 మంది విద్యార్థులు 8 గ్రూపులుగా పాల్గొన్నారు. వర్తమాన అంశాలు, ఆర్థిక భూగోళ వైజ్ఞానిక, చరిత్ర సంస్కృతి. కరెంట్ ఎఫైర్స్, జనరల్ నాలెడ్జికి సంబంధించిన ప్రశ్నలను సంధించారు. ఎనిమిది రౌండ్లలో జరిగిన పోటీలో మొత్తం 60 ప్రశ్నలను టీమ్ సభ్యులను అడిగారు. గ్రంథాలయ సహ కార్యదర్శి డి.వి.సూర్యారావు క్విజ్ మాస్టర్‌గా వ్యవహరించారు. పోటీ విజేతలకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

బాక్సింగ్ పోటీల విజేత మాస్టర్‌మైండ్స్ విద్యార్థిని

డాబాగార్డెన్స్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాజమహేంద్రవరంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–17 బాక్సింగ్ పోటీల్లో కామర్స్ విద్యా సంస్థ మాస్టర్‌మైండ్ విద్యార్థిని ఎస్.దుర్గాస్ఫూర్తిశ్రీ ప్రథమ బహుమతి సాధించింది. ఈ సందర్భంగా మాస్టర్‌మైండ్స్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో అడ్మిన్ ప్రిన్సిపాల్ సీహెచ్ అంజిరెడ్డి మాట్లాడుతూ కోచ్‌లు ఎం.సతీష్, ఐ.వేంకటేశ్వరరావు(ద్రోణాచార్య అవార్డు గ్రహీత) వద్ద దుర్గాస్ఫూర్తిశ్రీ తర్ఫీదు పొందిందన్నారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని అభిలషించారు. ఈ సందర్భంగా దుర్గాస్ఫూర్తిశ్రీని అభినందించారు. కార్యక్రమంలో బ్రాంచ్ ప్రిన్సిపాల్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

బాబోయ్ దుర్వాసన..!



భూపేష్‌నగర్ రహదారిలో వినాయకుడి గుడి వద్ద పూడిక కుప్ప

అల్లిపురం: జీవీఎంసీ 34వ వార్డు భూపేష్ నగర్, లక్ష్మీనగర్, చావులమదుం ప్రాంతాల్లోని మురుగు కాలువల్లో చెత్తను తీసి రోడ్లపై గుట్టలు, గుట్టలుగా వదిలేశారు. దీంతో ఆయా ప్రాంతాలు దుర్వాసనతో నిండిపోయాయి. మూడు రోజులుగా ఈ పరిస్థితి ఉండటంతో స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. ఆ రహదారి గుండా రాకపోకలు సాగిస్తున్న పాదచారులు, వాహన చోదకులు దుర్వాసనకు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందని వాపోతున్నారు. జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది తక్షణమే పూడికను తొలగించాలని వారు కోరుతున్నారు.

అలరించిన గాత్ర కచేరీ



త్యాగరాజ కీర్తనలు ఆలపిస్తున్న వందన

సీతంపేట: త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో భాగంగా కార్తికేయ కళాక్షేత్రం వ్యవస్థాపకులు నిష్టల కృష్ణవేణి ఆధ్వర్యంలో శనివారం ద్వారకానగర్ బీవీకే శాలలో డాక్టర్ కె.వందన చేసిన గాత్ర సంగీత కచేరీ ఆహుతులను అలరించింది. తిరుపతి శ్రీవెంకటేశ్వర సంగీత కళాశాలలో ఆచార్యులుగా పనిచేస్తున్న వందన తన అద్భుత గాత్రంతో వీనుల విందు చేశారు. నన్ను విడచి కదలకురా అనే రీతి గౌళ రాగకృతి, నే పొగడకుంటే అనే శుభపంతురావళి రాగకృతి, స్వరరాగసుధ అనే శంకరాభరణ రాగకృతి కీర్తనలు ఆలపించి ఆకట్టుకున్నారు. వీరికి మంథా శ్రీరమ్య వయొలిన్‌పై, పి.ఎస్.ఫల్గుణ మృదంగంపై వాద్య సహకారం అందించారు. త్యాగరాజ ఉత్సవాల సందర్భంగా పలు అంశాల్లో నిర్వహించిన పోటీల్లో విజేతలకు ముఖ్య అతిథి మృదంగ విద్వాంసుడు వంకాయల వేంకట రమణమూర్తి చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు.

దశ తిరిగింది

- 'దక్షిణ' పరిధిలో బీచ్ ప్రాంత సుందరీకరణ
- 29వ వార్డులో పారాపెట్ వాల్ ఆధునికీకరణ
- అభివృద్ధి పనులకు కౌన్సిల్ సమావేశంలో ఆమోదం



కోస్టల్ బ్యాటరీ వద్ద సుందరీకరించిన ఐలెండ్(ఫైల్)



బీచ్ రోడ్డులో గోడపై అద్భుత చిత్రాలు

డాబాగార్డెన్స్: దక్షిణ నియోజకవర్గ పరిధిలోని బీచ్ ప్రాంతానికి మంచి రోజులు వస్తున్నాయి. గతేడాది పీఎఫ్ఆర్ పుణ్యమా.. అని రోడ్లు వేశారు. ఫుట్‌పాత్‌లకు మరమ్మతులు చేపట్టారు. పార్కులు సుందరంగా తీర్చిదిద్దారు. విద్యుత్ దీపాలు వెలిగించారు. ఈ పనులన్నీ చేపట్టి దాదాపు ఏడాదైంది. మళ్లీ అంతర్జాతీయ సదస్సుల పుణ్యమా.. అంటూ ఈ ప్రాంత దశ తిరిగింది.

ఇవీ అభివృద్ధి పనులు..

జీ–20 సదస్సు, ఇన్ఫినిటీ వైజాగ్–2023, వైజాగ్ టెక్ సమ్మిట్, గ్లోబల్ ఇన్వెస్టర్ సమ్మిట్ వంటి శిఖరాగ్ర సమావేశాల దృష్ట్యా సుమారు కోట్లాది రూపాయలతో పలు పనులు చేపట్టనున్నారు. 29వ వార్డు బీచ్ రోడ్డులోని ప్రస్తుత రిటైనింగ్ వాల్‌పై పారాపెట్ గోడ సుందరీకరణ, చిల్డ్రన్ పార్క్ నుంచి సీ పెరల్ పార్కింగ్ వరకు ఉన్న ప్రహరీకి గ్రానైట్(నార్త్ సైడ్ స్ట్రెచ్)ను అభివృద్ధి చేయనున్నారు. పాత పారాపెట్‌పై ఉన్న పైపులను తొలగించి గోడ ఎత్తు పెంచి గ్రానైట్ బెంచీలు ఏర్పాటు చేయనున్నారు. అందుకు రూ.45 లక్షలతో బడ్జెట్ అంచనా రూపొందించారు. ఈ పనులకు శనివారం నిర్వహించిన స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. రూ.44 లక్షలతో పాత మున్సిపల్ కార్యాలయం(బీచ్ రోడ్డు టౌన్ హాల్ నుంచి) సిఫ్‌నెట్ జంక్షన్ వరకు రోడ్డు అంచు నుంచి కెర్బ్ వాల్ వరకు ఇంటర్ లాకింగ్ కాంక్రీట్ పేవ్‌మెంట్ వేసి అభివృద్ధి చేయనున్నారు. రూ.34.85 లక్షలతో పాత మున్సిపల్ ఆఫీస్ నుంచి ఆర్కే బీచ్ వరకు ప్రస్తుత రిటైనింగ్ వాల్‌పై ప్యారపెట్ గోడ సుందరీకరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ పనులకు సంబంధించి స్టాండింగ్ కమిటీ సమావేశంలో సభ్యులు ఆమోదించారు. వెనువెంటనే పనులు ప్రారంభం కానున్నాయి.

ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి లైన్‌క్లియర్..

జీవీఎంసీ 37వ వార్డు బీచ్ రోడ్డులోని మత్స్యభవన్ ఎదురుగా ఉన్న ముస్లిం శ్మశానవాటిక అభివృద్ధికి ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో సభ్యులు ఆమోదం తెలిపారు. రూ.కోటి 90 లక్షలతో శ్మశానవాటికకు దెబ్బతిన్న గోడ స్థానంలో ప్రహరీ నిర్మించనున్నారు. వెయిటింగ్ హాల్ కమ్ ప్రార్థనా మందిరం, నిరంతర నీటి సరఫరా, నడక మార్గాలు నిర్మాణం, శ్మశానవాటికకు యార్డ్ లైటింగ్ ఏర్పాటు చేయనున్నారు. దీనికి సంబంధించి కార్పొరేటర్ చెన్నా జానకీరామ్ ఇటీవల జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఈ అంశాన్ని లేవనెత్తారు.

అవగాహనతో క్యాన్సర్ నివారణ



అవగాహన ర్యాలీలో పాల్గొన్న మహిళా కళాశాల ప్రిన్సిపాల్ శోభారాణి, విద్యార్థినులు, సిబ్బంది

అల్లిపురం: ప్రపంచ క్యాన్సర్ డే సందర్భంగా విశాఖ ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్‌సీసీ యూనిట్, కమ్యూనిటీ రూరల్ మెడికల్ ప్రాక్టీసనర్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శోభారాణి జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అవగాహనతో క్యాన్సర్ వ్యాధిని నివారించవచ్చన్నారు. అనంతరం విద్యార్థినులు మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంది.. మానుకో మానుకో వ్యసనాల మానుకో అంటూ నినాదాలు చేస్తూ డాబాగార్డెన్స్, గొల్లలపాలెం ప్రాంతాల్లో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సుగుణేశ్వరి, ఆకుల రవికుమార్, బృందా హాస్పిటల్స్ మేనేజర్, ఎన్‌సీసీ ఆఫీసర్ డాక్టర్ కె.గీతాంజలి, ఎన్‌సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

'నూతన సామాజిక ఒరవడి'పై వాకథాన్



వాకథాన్‌ను ప్రారంభిస్తున్న ప్రసాద్

సీతమ్మధార: ధాన్ ఫౌండేషన్ వైజాగ్ రీజియన్ ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నూతన సామాజిక ఒరవడి అనే అంశంపై వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ థీమ్‌పై ఫౌండేషన్ మహిళలు నినాదాలు చేస్తూ వాక్ నిర్వహించారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ పూర్వ డైరెక్టర్ ప్రసాద్ ర్యాలీని ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ధాన్ ఫౌండేషన్ రీజనల్ కో ఆర్డినేటర్ శైలజ మాట్లాడుతూ వాకథాన్ థీమ్స్ ఉద్దేశాన్ని సభ్యులందరికీ వివరించారు. ఫౌండేషన్ ప్రోగ్రాం లీడర్ జానకీరామన్ మాట్లాడుతూ చిన్నప్పటి నుంచే పిల్లల్లో మంచి విలువలను పెంపొందించాలని, తల్లులు ప్రధాన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ జీవనోపాధిపై ఎక్కువ శ్రద్ధ పెట్టాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ భానుప్రకాష్, సమాఖ్య నాయకులు ఆదిలక్ష్మి, గౌరీ, నళిని, లీల, షబీద, రమ, కళంజియా సభ్యులు పాల్గొన్నారు.

నర్సుల సంఖ్య పెంచాలని వినతి



మంత్రి విడదల రజినికి పుష్పగుచ్ఛం అందిస్తున్న ప్రభుత్వ నర్సుల సంఘం సభ్యులు

మహారాణిపేట: ప్రభుత్వ ఆస్పత్రుల్లో నర్సుల కొరత ఎక్కువగా ఉందని, ఆస్పత్రుల్లో విభాగాలు పెరుగుతున్న వారి సంఖ్య పెరగడం లేదని, దీని వల్ల పనిచేస్తున్న నర్సులపై అదనపు భారం పడుతోందని ప్రభుత్వ నర్సుల సంఘం ప్రతినిధులు డి.లక్ష్మి, కె.వరలక్ష్మి అన్నారు. కేజీహెచ్ సీఎస్సార్ బ్లాక్‌కు శనివారం వచ్చిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజినికి పలు సమస్యలపై వారు వినతిపత్రం సమర్పించారు. తొలుత మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నర్సుల రిక్రూట్‌మెంట్ చేయాలని, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న నర్సుల సర్వీసెస్‌ను రెగ్యులర్ చేయాలని సంఘ నాయకురాలు డి.లక్ష్మి కోరారు. ఇతర సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో సంఘ సభ్యులు ఉషా, ఎస్.ప్రశాంతి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబూ కాలనీలో నివసిస్తున్న కె.కనకరాజు అనారోగ్యంతో మంచాన పడ్డాడు. అతడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో స్థానిక వలంటీర్ సంతోష్.. కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ దృష్టికి విషయాన్ని తీసుకెళ్లింది. కార్పొరేటర్ స్పందించడంతో శనివారం కనకరాజు భార్య కె.కవితకు మందుల ఖర్చుల నిమిత్తం వైఎస్సార్‌సీపీ వార్డు సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ రూ.5 వేల ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ వార్డు వర్కింగ్ ప్రెసిడెంట్ వి.వేళంగిణీరావు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల ప్రాతినిధ్యానికి పోస్ట్‌కార్డు ఉద్యమం



పోస్ట్‌కార్డు ఉద్యమంలో పాల్గొన్న ముస్లింలు

డాబాగార్డెన్స్: రాష్ట్రంలోని ఏలూరు నుంచి ఇచ్ఛాపురం వరకు గల 68 నియోజకవర్గాల్లో కనీసం ఒక్క నియోజకవర్గానైనా ముస్లింలకు కేటాయించాలంటూ శనివారం పోస్ట్‌కార్డ్ ఉద్యమం ప్రారంభమైంది. పాతనగరంలోని జామియా మసీదులో ముస్లిం మత పెద్దలు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. మసీదుకు వచ్చిన ముస్లింలు పోస్ట్‌కార్డు ఉద్యమంలో పాల్గొని వచ్చిన వాటిని ఉత్తరాంధ్ర ముస్లిం ఫోరమ్ ప్రతినిధులకు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి లక్ష పోస్ట్‌కార్డులను అందజేయనున్నట్టు ఫోరమ్ అధ్యక్షుడు ఎస్ఎం ఇక్బాల్, కన్వీనర్ ఖాజా రహ్మతుల్లా, ముస్లిం మత పెద్దలు తెలిపారు.

వైభవంగా షిర్డీసాయి మందిర వార్షికోత్సవం



విశేష అలంకరణలో సాయిబాబా



అన్నదానం చేస్తున్న ధర్మకర్త శ్రీనివాసరావు

అల్లిపురం: జెండాచెట్టు వీధిలో వెలసిన షిర్డీసాయి బాబా మందిర 25వ వార్షికోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో తెల్లవారు జాము నుంచి బాబాకు పంచామృతాభిషేకాలు, విభూతి హారతి, విశేష అర్చనలు ఆలయ అర్చకులు జరిపారు. ఆలయ ఆవరణలో హోమం చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం బాబా చావడి ఉత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవ విగ్రహాన్ని జెండాచెట్టు వీధి నుంచి లక్ష్మీదేవిపేట, అంబేడ్కర్ కాలనీ, భూపేష్‌నగర్ ప్రాంతాల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కొమర శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు లింగం శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యత అవసరం



సన్మాన గ్రహీతలతో ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్

బీచ్‌రోడ్డు: సామాజిక బాధ్యతతో ప్రతీ ఒక్కరు సేవా కార్యక్రమాలు కొనసాగించాలని, ఇతరులకు స్ఫూర్తిదాయకంగా నిలవాలని ఎమ్మెల్సీ వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. న్యూ హోప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఓ హోటల్‌లో శనివారం వారియర్ ఆఫ్ ది ఇయర్ అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని సత్కరించడం అభినందనీయమన్నారు. న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లీశ్వరి సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. వీజేఎఫ్ అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు మాట్లాడుతూ వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచి ఇతరులకు స్ఫూర్తిగా నిలిచిన వారిని గుర్తించి అవార్డులు అందజేసిన నిర్వాహకులను అభినందించారు. ప్రతీ ఒక్కరూ ఏదో ఒక దశలో తోటి వారికి తగిన సహాయం అందించాలని పిలుపు నిచ్చారు. న్యూ హోప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు మల్లీశ్వరి మాట్లాడుతూ తాము చేస్తున్న మంచి కార్యక్రమాలకు ప్రజల నుంచి అనుహ్య స్పందన వస్తుందన్నారు. సేవే ధ్యేయంగా తమ ఫౌండేషన్ పనిచేస్తుందని చెప్పారు. జీవీఎంసీ సిబ్బంది, జర్నలిస్టులు, రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగులతోపాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులకు అతిథుల చేతుల మీదుగా అవార్డులను అందజేశారు.

స్కౌట్స్, గైడ్స్ ఉపాధ్యాయుల శిక్షణ ప్రారంభం



శిక్షణకు హాజరైన స్కౌట్ మాస్టర్లు

సీతంపేట: భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యాలయం ఆధ్వర్యంలో లంకపల్లి బుల్లయ్య కళాశాలలో శనివారం స్కౌట్ మాస్టర్లు, గైడ్ కెప్టెన్లు, రోవర్ స్కౌట్ లీడర్లు, రేంజర్ లీడర్ల శిక్షణ శిబిరం ప్రారంభమైంది. బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కళాశాల, పాఠశాలలో తప్పనిసరిగా స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థాపించాలని సూచించారు. రాష్ట్ర శిక్షణాధికారులు బి.ఉమాదేవి, మోహన్‌రావు శిక్షణ ప్రాముఖ్యాన్ని వివరించారు. రేంజర్ విభాగం నుంచి 45 మంది, స్కౌట్స్ విభాగం నుంచి 55 మంది శిక్షణకు హాజరయ్యారు. కార్యక్రమంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ ఉపాధ్యక్షుడు నరవ ప్రకాశరావు, రాష్ట్ర కమిషనర్ శకుంతల, క్యాంప్ లీడర్ ఎస్.వెంకటేశ్వర్లు, శిక్షకులు పి.సునీల, డి.వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల పునర్వివాహ పరిచయ వేదిక



బుక్లెట్‌ను ఆవిష్కరిస్తున్న సంఘాల ప్రతినిధులు, నిర్వాహకులు

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా ఆర్యవైశ్య సంఘం, పాతనగరం వుడ్‌యార్డ్ స్ట్రీట్‌లోని వాసవీ కల్యాణ మండప సంఘాల ఆధ్వర్యంలో శనివారం పునర్వివాహ పరిచయ వేదిక నిర్వహించారు. పెళ్లి సంబంధాలు కుదరక తల్లిదండ్రులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని, భర్త లేక భార్య చనిపోయినా లేదా విడాకులు తీసుకుని విడిపోయినా, జీవిత చరమాంకంలో ఒకరికి ఒకరు తోడు అవసరం ఉంటుందనే నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్టు ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు తమ్మన అమర్‌నాథ్, వాసవీ కల్యాణ మండప సంఘ అధ్యక్షుడు విన్నకోట రామ్మూర్తి తెలిపారు. విశాఖతోపాటు వివిధ జిల్లాలు, ఇతర రాష్ట్రాల నుంచి సుమారు 250 మంది మహిళలు, పురుషులు పాల్గొన్నారని కార్యక్రమ చైర్మన్ ఐఆర్‌కే ప్రసాద్ చెప్పారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్య ఆలస్య, పునర్వివాహ పరిచయ వేదికకు సంబంధించిన బుక్లెట్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ ప్రధాన కార్యదర్శి బోనగిరి శ్రీరాములు, కందుల మూర్తి, వేదమధుసూదన్, ఉప్పల జగన్నాథరావు, దుర్గా సోమేశ్వరరావు, యలమర్తి గణేష్, చెరకు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో కాటికాపరికి తీవ్రగాయాలు



గాయపడిన పోలిపిల్లి పైడిరాజు

మర్రిపాలెం: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి తీవ్రంగా గాయపడిన ఘటన కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కొబ్బరితోటకు చెందిన పోలిపిల్లి పైడిరాజు జ్ఞానాపురం శ్మశానవాటికలో కాటికాపరిగా పనిచేస్తున్నాడు. శనివారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో టిఫిన్ చేయడానికి బయటకు వెళ్లి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురయ్యాడు. కంచరపాలెం రైల్వే అండర్ బ్రిడ్జి నుంచి కాన్వెంట్ కూడలి మీదుగా రైల్వే స్టేషన్‌కు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఓ వ్యక్తి.. జ్ఞానాపురం జంక్షన్ వద్దకు వచ్చే క్రమంలో రహదారిని అధిగమిస్తున్న పైడిరాజును బలంగా ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలై అతడు అపస్మారక స్థితికి చేరుకున్నాడు. కంచరపాలెం ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రుడిని వెంటనే కేజీహెచ్‌కు తరలించారు. ప్రస్తుతం అతడి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు. పైడిరాజు బంధువు ఫిర్యాదు మేరకు కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ మొహమ్మద్ బేగం కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేత్రపర్వం.. లలితాకామేశ్వరుల గ్రామోత్సవం



పల్లకీపై లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న భక్తులు



ప్రత్యేక రథంపై లలితా పీఠాధిపతి సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి

సీతంపేట: లలితానగర్ లలితా పీఠం 74వ వార్షిక బ్రహ్మోత్సవాలు పీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామి పర్యవేక్షణలో రెండు వారాలుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. శనివారం సాయంత్రం లలితాకామేశ్వరుల గ్రామోత్సవం పురవీధుల్లో నేత్రపర్వంగా జరిగింది. ఈ సందర్భంగా లలితాకామేశ్వరుల ఉత్సవ విగ్రహాలను చూడముచ్చటగా అలంకరించి పల్లకీపై భక్తులు ఊరేగించారు. కుర్తాళం, లలితా పీఠాధిపతి జగద్గురు సిద్ధేశ్వరానంద భారతీ మహాస్వామిని ప్రత్యేక రథంలో ఊరేగించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించి పసుపు, కుంకుమలతో పూజలు చేశారు. శక్తి పీఠాధీశ్వరి మాతా రమ్యానంద భారతీ స్వామిని పర్యవేక్షణలో మహిళలు పెద్ద సంఖ్యలో రథయాత్రలో పాల్గొన్నారు.

అమ్మవారికి భక్తుల నీరాజనాలు

లలితానగర్‌లోని లలిత గుడి వద్ద ప్రారంభమైన ఊరేగింపు శంకర మఠం రోడ్, డైమండ్ పార్కు, దొండపర్తి, అక్కయ్యపాలెం, రైల్వే న్యూకాలనీల మీదుగా తిరిగి ఆలయానికి చేరుకుంది. విద్యుత్ దీపాలు, అలంకరణ, సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఊరేగింపులో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఊరేగింపులో భక్తులు వేలాదిగా వెంటరాగా, అమ్మవారికి అడుగడుగునా భక్తులు హారతులిచ్చి, టెంకాయలు కొట్టి నీరాజనాలు పలికారు. ఆదివారం ఉదయం 7.30 గంటలకు పీఠంలో కాళీ కాలభైరవుల ప్రతిష్ఠ, విశేష పూర్ణాహుతి, కుంభాభిషేకం, శాంతి కల్యాణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. కార్యక్రమంలో పీఠం ఆస్థాన వేద పండితుడు మాచవోలు రమేష్ శర్మ, సీఈవో మోచర్ల శశిభూషణ్ పాల్గొన్నారు.

వాకర్స్ సేవలు శ్లాఘనీయం



మాట్లాడుతున్న వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు రవీంద్ర

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ నిర్వహిస్తున్న సేవా కార్యక్రమాలు శ్లాఘనీయమని వాకర్స్ ఇంటర్నేషనల్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్పీ రవీంద్ర అన్నారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో శనివారం సాయంత్రం నిర్వహించిన క్లబ్ వార్షికోత్సవంలో ఆయన మాట్లాడారు. వాకర్స్ క్లబ్ సభ్యులు నిస్వార్థంగా సేవలు చేస్తూ అందరి ప్రశంసలు అందుకున్నారన్నారు. నడక ప్రాధాన్యాన్ని తెలుపుతూనే ఆరోగ్య పరిరక్షణకు అవసరమైన కార్యక్రమాలు నిర్వహించడం హర్షించదగ్గ విషయమన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ కె.బాబూరావు రచించిన నాలో నేను అనే కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ ఇంటర్నేషనల్ అదనపు సెక్రటరీ జనరల్ ఆర్.సత్యనాథం, వాకర్స్ డిస్ట్రిక్ట్–101 గవర్నర్ యు.శుభ, వాకర్స్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లా చంద్రమౌళి, ఎల్‌వీ సుధాకర్, డాక్టర్ కె.బాబూరావు, కె.ద్వారకానాథ్, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

వైభవ వేంకటేశ్వరుడికి విశేష సేవలు

మురళీనగర్: కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వర స్వామికి శనివారం సుప్రభాత సేవ సంప్రదాయసిద్ధంగా నిర్వహించారు. తెల్లవారుజామున సన్నిధి గొల్ల సేవ చేసి సుప్రభాతం చదివి వినిపించారు. అనంతరం స్వామికి అభిషేకాలు చేశారు. ఉదయం 7.30 గంటలకు బాలభోగం, 9.30 గంటలకు భక్తుల సమక్షంలో శ్రీవారికి అర్చన, మంగళా శాసనం, తీర్థప్రసాద గోష్ఠి, 10 గంటలకు సామూహిక విష్ణు సహస్రనామార్చన, 11.30 గంటలకు రాజభోగ నివేదన జరిపారు. మధ్యాహ్నం భక్తులకు నిర్వాహకులు అన్నదానం చేశారు. సాయంత్రం 7 గంటలకు నక్షత్ర, కర్పూర, కూష్మాండ, కుంభ హారతులు వైభవుడికి సమర్పించారు. భక్తులు అత్యధిక సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

విద్యార్థులకు ఆరోగ్యమైన విద్యా బోధన

ఆరిలోవ: విద్యార్థులకు ఆరోగ్యకరమైన విద్యాబోధన జరగాలని సెంచూరియన్ వర్సిటీ వీసీ జి.ఎస్.ఎన్.రాజు పేర్కొన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్‌లో శనివారం నగరంలో సీబీఎస్ఈ పాఠశాలల ఉపాధ్యాయులకు 'సీబీఎస్ఈ కెపాసిటీ బిల్డింగ్ ప్రోగ్రాం' పేరుతో రెండు రోజుల వర్క్ షాపు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు ఆరోగ్య సూచనలు పాటించాలన్నారు. ఉపాధ్యాయులు ఆరోగ్యంగా ఉండటంతో పాటు దాని గురించి అవగాహన ఉండాలన్నారు. విశాఖ వ్యాలీ స్కూల్ ప్రిన్సిపాల్ ఈశ్వరి ప్రభాకర్ మాట్లాడుతూ ఈ ప్రోగ్రాం రెండు రోజులు జరగనుందన్నారు.

శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవస్థానం

దేవాదాయ - ధర్మాదాయ శాఖ

దొండపర్తి, విశాఖపట్నం - 530016

విద్యుత్ అలంకరణ కొటేషన్లు స్వీకరణ

విశాఖపట్నం సిటీ, దొండపర్తిలో వేంచేసియున్న శ్రీ ఎరుకుమాంబ అమ్మవారి దేవాలయం వద్ద మహాశివరాత్రి ఉత్సవము పర్వదినాన్ని పురస్కరించుకొని తేదీ. 18-02-2023, 19-02-2023లలో దేవస్థానం వారు నిర్ణయించిన షెడ్యూలు ప్రకారం విద్యుత్ అలంకరణ చేయుటకు సీల్డు కొటేషన్లు కోరబడుచున్నవి. సీల్డు కొటేషన్లు దాఖలు చేయువారు కోడ్ చేయబోవు మొత్తమును ఒక లేఖ రూపంలో వ్రాసి తేది. 08-02-2023 ఉదయం 10గం॥ లోపుగా దేవాలయము వద్దనున్న బాక్సులో వేయవలెను. అదేరోజు ఉదయం 11గం॥లకు దేవాదాయ శాఖ అధికారుల సమక్షంలో కొటేషన్లు తెరిచి, ఎవరైతే తక్కువ కోడ్ చేసియున్నారో వారి కొటేషన్లు ఆమోదించబడును. లైటింగ్ షెడ్యూలు కొరకు దేవస్థానం కార్యాలయం పనివేళల్లో సంప్రదించవలెను.

విశాఖపట్నం, తేది. 30-01-2023 — శ్రీమతి జి.వి.రమాబాయి, కార్యనిర్వహణాధికారిణి